# జ్ఞాపకాల భోగి మంట

మళ్ళీ ధనుర్మాసం మొదలయ్యింది
చలి పరదాలలో చిక్కుకుని నగరం
గజాగజా వణుకుతుంది.

ధనుర్మాసం తో పాటే
జ్ఞాపకాల చలిమంటలు
మళ్ళీ రాజుకుంటాయి.

ఎక్కడ తిరుప్పావై విన్నా
పచ్చని పూలగుత్తులతో
కోనేటి మీదకు వంగిన నిద్రగన్నేరూ,
గుడిగంటల్ని మోస్తూ నిటారుగా
నిలబడ్డ మా ఊరి ధ్వజస్థంభం
చటుక్కున కళ్ళముందు నిలుస్తాయి

నాజూగ్గా పండిన గోరింటాకు చేతులూ
గోదారిలా ముందుకు దూకే జడా
మావి చిగురు అంచు పట్టులంగా
ఎంతకీ అవని రథం ముగ్గూ
వాకిళ్ళలో రంగవల్లుల మధ్య చల్లిన
బంతిరేకులూ, ఎర్రరేగిపళ్ళూ
కళ్ళలో వెలిగే కలల దివిటీలూ
కెంపుతీగల భోగిమంటల చుట్టూ
చలికాగుతున్న పగడాల చెక్కిళ్ళూ
పకపకనవ్వులూ మరోసారి గుర్తుకు వస్తాయి.

-- డా. వైదేహీ శశిధర్